నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

11 | హైదరాబాద్, ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | HYDERABAD


హెచ్ఎండీఏలో

# టెండర్లు

దాదాపు 4 నెలల తర్వాత

ప్రాజెక్టుల అభివృద్ధి పనుల్లో కదలిక

ప్రాజెక్టులను పట్టించుకోలేదని నమస్తే తెలంగాణలో కథనాలు

నమస్తే ఎఫెక్ట్

ఎట్టకేలకు స్పందించిన హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ ఎట్టకేలకు ప్రాజెక్టుల పనులను పూర్తి చేసేందుకు సిద్ధమైంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్న హెచ్ఎండీఏ వేల కోట్ల రూపాయలతో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో పలు ప్రాజెక్టులను చేపట్టింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా పక్కన పెట్టేసింది. దీనిపై నమస్తే తెలంగాణలో పలు కథనాలు వచ్చాయి. వీటిపై స్పందించిన ఉన్నతాధికారులు ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులను గుర్తించి టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగానే రాజేంద్రనగర్ బుద్వేల్‌లో 182 ఎకరాల్లో హెచ్ఎండీఏ చేపట్టిన లేఅవుట్‌లో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.354 కోట్లు, అదేవిధంగా మోకిలలో చేపట్టిన లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పన కోసం మరో రూ.47 కోట్లతో కలిపి రెండు టెండర్లను హెచ్ఎండీఏ ఆహ్వానించింది. ఎన్నికల కోడ్ మూలంగా నవంబర్, డిసెంబర్ నెలలు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండు నెలలు కలిపి దాదాపు 4 నెలల తరువాత టెండర్లు ఆహ్వానించడం శుభపరిణామం.



## మురుగు శుద్ధికి ముందడుగు

కొత్తగూడలోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో జలమండలి నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని శనివారం పరిశీలిస్తున్న సీఎం సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎం పద్మజ, జీఎం తిప్పన్న, తదితరులు - సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ)




అతనే ఒక చరిత్ర డాక్యుమెంటరీ ప్రదర్శనను తిలకిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, నాయకులు

# వర్ధిల్లు వెయ్యేండ్లు

వైభవంగా ఉద్యమనేత కేసీఆర్ జన్మదినం




తెలంగాణ భవన్‌లో ఘనంగా సంబురాలు

## ఆటోడ్రైవర్లకు బీమా పత్రాలు.. దివ్యాంగులకు వీల్ చైర్లు

**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,** బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన వేడుకలు శనివారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. శనివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబురాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు సీనియర్ పార్టీ నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వెయ్యి మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల కవరేజీతో కూడిన ఇన్సురెన్స్ పత్రాలను, 10 మంది దివ్యాంగులకు వీల్ చైర్‌లను మాజీ మంత్రి కేటీఆర్ పంపిణీ చేశారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా తయారు చేయించిన 70 కిలోల భారీ కేక్‌ను రాజ్యసభ సభ్యులు కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి కేటీఆర్ కట్ చేశారు. అనంతరం కేసీఆర్ జీవిత, రాజకీయ, తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో ప్రత్యేకంగా రూపొందించిన 'అతనే ఒక చరిత్ర' డాక్యుమెంటరీని వీక్షించారు. ఎంతో గొప్పగా డాక్యుమెంటరీని చేశారని తలసాని సాయి కిరణ్ యాదవ్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు.



తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ఆటోడ్రైవర్లకు ఉచిత బీమా పత్రాలను అందజేస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు తదితరులు

తెలంగాణ భవన్‌లో కేక్ తినిపించుకుంటున్న మహిళా నాయకులు






స్టాల్ హోల్డర్లకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు

## నుమాయిష్.. నేడే ఆఖరు

అబిడ్స్, ఫిబ్రవరి 17 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్) ఆదివారం ముగియనుంది. శనివారం నాటికి సందర్శకుల సంఖ్య దాదాపు ఇరవై లక్షలు దాటింది. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దాదాపు 2400 వరకు స్టాళ్లతో ప్రతి యేట జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తారు. ఈ సారి స్టాల్ హోల్డర్స్ విజ్ఞప్తి మేరకు నుమాయిష్‌ను మూడు రోజులు పెంచుతున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, మంత్రి డి. శ్రీధర్‌బాబు ప్రకటించారు. దీంతో 18వ తేదీన నుమాయిష్ ముగియనుంది. శనివారం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నుమాయిష్‌కు సహకరించిన అధికారులు, స్టాల్ నిర్వాహకులు, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యాసంస్థలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి బి. హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్, కోశాధికారి ఏనుగుల రాజేందర్‌కుమార్, వనం వీరేందర్, హరినాథ్‌రెడ్డి, వినయ్ ముదిరాజ్‌లతో పాటు వివిధ మేనేజింగ్ కమిటీల సలహాదారులు, కన్వీనర్‌లు, కో కన్వీనర్‌లు పాల్గొన్నారు.

# ఇండ్లు కొంటలేరు

## హైదరాబాద్‌లో తగ్గిన గృహాల రిజిస్ట్రేషన్లు

జనవరిలో 5,411 యూనిట్లు మాత్రమే.. నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 17 : హైదరాబాద్‌లో కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ఇండ్ల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి. జనవరి నెలలో కేవలం 5,411 యూనిట్ల గృహాలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అయిన 5,454 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఒక్క శాతం తగ్గాయని నైట్‌ఫ్రాంక్ తాజాగా వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలో నాలుగు జిల్లాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డిలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాలో అయిన ఇండ్ల రిజిస్ట్రేషన్ల విలువ రూ.3,279 కోట్లుగా ఉంటుందని తెలిపింది. సంఖ్య పరంగా చూస్తే తగ్గినప్పటికీ..విలువ పరంగా చూస్తే మాత్రం 24 శాతం పెరిగాయి. ఇండ్ల ధరలు పెరగడం ఇందుకు కారణమని విశ్లేషించింది.

- మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.25-50 లక్షల ధరల శ్రేణి ఇండ్ల రిజిస్ట్రేషన్ల వాటా 47 శాతంగా ఉన్నది.
- రూ.25 లక్షల లోపు ధర కలిగిన ఇండ్ల రిజిస్ట్రేషన్ల వాటా 15 శాతం
- కోటి రూపాయల కంటే అధిక ధర కలిగిన ఇండ్ల వాటా 8 శాతం నుంచి 14 శాతానికి పెరిగాయి.
- 1,000-2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు 71 శాతం వాటా కలిగి ఉన్నాయి.
- వెయ్యి చదరపు అడుగులలోపు విస్తీర్ణం కలిగిన చిన్న స్థాయి ఇండ్లకు డిమాండ్ పడిపోయింది.
- 2 వేల చదరపు అడుగుల కంటే అధిక విస్తీర్ణం కలిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు 13 శాతానికి పెరిగాయి. గతేడాది ఇది 9 శాతంగా ఉన్నది.
- మొత్తం రిజిస్ట్రేషన్లలో 43 శాతం వాటాతో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండగా, 42 శాతంతో మేడ్చల్-మల్కాజిగిరి, 15 శాతంతో హైదరాబాద్ ఆ తర్వాతి స్థానంలో నిలిచింది.
- ధరల పరంగా చూస్తే రంగారెడ్డి జిల్లాలో ఇండ్ల ధరలు 12 శాతం పెరగగా, హైదరాబాద్ జిల్లాలో 11 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5 శాతం అధికమయ్యాయి.





నెక్లెస్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం జెండా ఊపి 108 స్పెషల్ ట్రాఫిక్ మొబైల్ వాహనాలను ప్రారంభిస్తున్న నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

# 108 స్పెషల్ ట్రాఫిక్ మొబైల్ వాహనాలు

## నగరంలో ట్రాఫిక్ సమస్య నివారిస్తాం

నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు కొత్తగా 108 స్పెషల్ ట్రాఫిక్ మొబైల్ వాహనాలను ప్రారంభించామని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నెక్లెస్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద 108 స్పెషల్ ట్రాఫిక్ మొబైల్ వాహనాలను కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు నగరంలో సగటున దాదాపు 1250 కొత్త వాహనాలు రోడ్లపైకి అదనంగా వస్తున్నట్లు తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకుని నగరంలో ట్రాఫిక్ సాఫీగా వెళ్లేలా పర్యవేక్షించేందుకు 108 స్పెషల్ ట్రాఫిక్ మొబైల్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సీపీ తెలిపారు. వీటికి పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్, సైరన్, ఫ్లాషింగ్ లైట్స్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ వాహనాల ద్వారా ట్రాఫిక్ సిబ్బంది ట్రాఫిక్ జామ్ ఉన్న చోటకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తారన్నారు. అంతేకాకుండా నగరంలో టాఫ్రిక్ సమస్యను నివారణకు గత నెల 155 ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, 30 వేల మందికి అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందితో సీపీ ప్రతిజ్ఞ చేయించారు. నగర అదనపు పోలీసు కమిషనర్(ట్రాఫిక్) పి.విశ్వప్రసాద్ మాట్లాడుతూ స్పెషల్ ట్రాఫిక్ మొబైల్ వాహనాల ద్వారా ట్రాఫిక్ సమస్యలను నివారించడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేసి ప్రజల ప్రాణాలు సైతం కాపాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 డీసీపీ సుబ్బరాయుడు, ట్రాఫిక్-2 డీసీపీ అశోక్‌కుమార్, అదనపు డీసీపీలు రంగారావు, శ్రీనివాసచార్యులు, సీపీఆర్ శిక్షణ కల్పించిన అపోలో వైద్యులు డా.ప్రవీణ్‌రెడ్డి, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.




సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరుగుతున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఈవో విజయకుమారి(ఫైల్)

# 100% ఉత్తీర్ణతే లక్ష్యం

## పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మేడ్చల్, ఫిబ్రవరి17(నమస్తే తెలంగాణ) : పదో తరగతితో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంపై విద్యాశాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ పాఠశాలలలో చదివే పదో తరగతి విద్యార్థులకు 40 రోజులుగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 108 ఉన్నత పాఠశాలలకు చదివే 7,601 పదవతరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతుంది. మార్చి 18 నుంచి జరగనున్న 10 తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో భాగంగా పాఠశాల వేళల్లో అదనంగా రెండు గంటల పాటు తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 8:30 గంటల నుంచి 9: 30 వరకు సాయంత్రం 4: 30 నుంచి 5: 30 వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. జనవరి 19 వరకు సిలబస్‌ను పూర్తి చేసి ఇటీవలే ప్రాక్టిస్ టెస్టులను విద్యార్థులకు నిర్వహించారు. ఈ నెల 19 నుంచి మొదటి ప్రీ ఫైనల్, రెండవ ప్రి ఫైనల్ పరీక్షలు మార్చి 1 నుంచి విద్యాశాఖ నిర్వహించనున్నది. గత ఏడాది జిల్లాలో 91 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాధికారిణి విజయకుమారి తెలిపారు.

# ప్యూర్ ఖాదీ సార్‌కు ఇష్టం

## కేసీఆర్ దుస్తులన్నీ మా దుకాణంలోనే..

శ్రీసాయి ఖాదీ వస్త్రాలయ యజమాని బిజ్జ సాయిబాబా



బిజ్జ సాయిబాబా

కేసీఆర్‌ను ఎవ్వరు కలిసినా ఆత్మీయంగా మాట్లాడుతారు. నేను ఎప్పుడు వెళ్లినా ఇంట్లో కుటుంబ సభ్యుడి మాదిరిగా భోజనం చేద్దామంటారు. మాకు కోఠిలోని తాజ్‌మహల్ హోటల్ ఎదురుగా 1947లో స్వదేశీ ఖాదీ వస్త్రాలయం ఉండేది. అప్పుడు మా నాన్న బిజ్జ మాణిక్యం ఆ వస్త్రాలయం చూసుకునేవాడు. అప్పుడు నా వయస్సు 18 ఏండ్లు. కేసీఆర్ సార్ మా దుఖానానికి వస్తుండేవారు. నాన్నతో మాట్లాడుతూ ఖాదీల ప్రాధాన్యతపై చర్చిస్తుండేవారు. నాతోనూ మాట్లాడేవాడు. ఆయన మొదట్నుంచి ప్యూర్ ఖాదీకి అత్యంత ప్రాధాన్యతనిస్తారు. 1985లో మా నాన్న మాణిక్యం చనిపోయాక మా ఇంటికి వచ్చి కేసీఆర్ మమ్మల్ని పరామర్శించారు. అనంతరం మేం హైదర్‌గూడలో 1991 నుంచి శ్రీ సాయి ఖాదీ వస్త్రాలయం ప్రారంభించాం. ఇప్పటికీ కేసీఆర్‌కు మేమే దుస్తులు కుట్టి ఇస్తాం. నెలకు 30 జతలకు పైగా దుస్తులు పంపిస్తుంటాం. ఎప్పుడు తీసుకెళ్లినా అవి ధరించి చాలా బాగున్నాయంటూ ప్రశంసిస్తుంటారు. 20 ఏండ్ల క్రితం మేం కుట్టి ఇచ్చిన దుస్తులను ఇప్పటికీ జాగ్రత్తగా కాపాడుకున్నారు. ఎలక్షన్స్ సమయంలో 150 దుస్తులు కుట్టి తీసుకెళ్లి అందించాం. ఇప్పుడు నా కొడుకు సతీశ్ కేసీఆర్ దుస్తుల బాధ్యతలు చూసుకుంటున్నాడు. సీఎంగా ఉన్న సమయంలో మా దుకాణానికి వచ్చారు. నా కొడుకు, కూతురు వివాహాలకు హాజరయ్యారు. కేసీఆర్ తెలంగాణ తెచ్చిన వ్యక్తి. ఆ పేరొక్కటి చాలు చరిత్రలో నిలిచేందుకు. కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఆ భగవంతుడి ఆశీస్సులు తనకెప్పుడూ ఉంటాయి.

-సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ)